క్లుప్తంగా

అబ్బయ్య చౌదరిని కలసిన నాయకులు



అబ్బయ్య చౌదరిని కలసిన కొవ్వలి వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని శుక్రవారం కొవ్వలి వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. తాము కొఠారు కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటామని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, కొవ్వలి కోపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, గొల్ల వీరస్వామి, పోలయ్య, నాయకులు, కార్యకర్తలు అబ్బయ్యచౌదరిని కలిసిన వారిలో ఉన్నారు.

అమర వీరులకు నివాళులు



సైనికులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు

దెందులూరు: జమ్మూ కాశ్మీర్‌లో 2019 ఫిబ్రవరి 14న 40 మంది భారత సీఆర్‌పీఎఫ్ సైనికులను పాకిస్తాన్ ముష్కరులు మానవ బాంబు రూపంలో మట్టుబెట్టారని ఆనాటి సైనికుల బలిదానం చరిత్రాత్మకమని, దేశం కోసం వారు చేసిన త్యాగం చిరస్థాయిగా నిలుస్తుందని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం దెందులూరు కళాశాలలో బ్లాక్ డే నిర్వహించారు. 40మంది భారత సైనికులు అమరులైనరోజు సందర్భంగా సైనికులకు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జాతీయ జెండాలతో ప్రదర్శన చేసి వారి సేవలను కొనియాడారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



జల్లికొమ్మర పాఠశాల సిబ్బందికి టీవీ అందజేసిన లయన్స్ సభ్యులు

గణపవరం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధనకు లయన్స్ క్లబ్ తరపున సహకారం అందించడం అభినందనీయమని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం జల్లికొమ్మర యూపీ పాఠశాలకు గణపవరం లయన్స్ క్లబ్ తరపున రూ.50 వేల విలువైన స్మార్ట్ టీవీ బహూకరించారు. ఈ సందర్భంగా గణపవరం సీఐ సుభాష్ టీవీని ప్రారంభించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని చదువులో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, జోన్ చైర్మన్ వెల్లంకి నరేష్, జిల్లా చైర్మన్లు కిలారి రవి, కె.సత్యనారాయణమూర్తి, ఎస్సై మణికుమార్, సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, లయన్స్ సభ్యులు రావూరి నాగరాజు, పచ్చిపులుసు నాగేశ్వరరావు, హెచ్ఎం సుందరకుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న లారీ అడ్డగింపు



ఆవులను తరలిస్తున్న లారీని నిలిపివేసిన బీజేపీ నాయకులు

దెందులూరు: ఎలాంటి అనుమతులు లేకుండా గోవులను అక్రమంగా తరలిస్తున్న ఏపీ 37 వీ 5780 లారీని దెందులూరు మండలం సోమవరప్పాడు పెట్రోల్ బంకు సమీపంలో బీజేపీ దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య వెంకటకృష్ణ, నాయకులు అడ్డుకున్నారు. గోవులను అక్రమంగా పెద్ద కంటైనర్‌లో తరలిస్తున్నారని నినాదాలు చేసి నిరసన తెలిపారు. డీఎస్పీకి నాయకులు సమాచారం అందించారు. అనంతరం దెందులూరు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ప్రేమికుల దినాన్ని నిషేధించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతీయ సంస్కృతిని మంట గలిపే ప్రేమికుల దినాన్ని బహిష్కరించాలని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పేరిట నిర్వహించే వికృత కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14న భారత దేశానికి ఒక బ్లాక్ డే అని పుల్వామాలో పాకిస్థానీలు 43 మంది భారత సైనికులను పొట్టనపెట్టుకున్నారని అన్నారు. సైనికులు త్యాగం చేసిన రోజున ఎటువంటి వేడుకలు చేసుకోకూడదన్నారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు అవపా సురేష్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు పరసా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం

- సంక్షేమ బోర్డు ఏర్పాటును విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయని చంద్రబాబు
- ప్రభుత్వం తీరుపై కార్మికులు, కార్మిక సంఘాల ఆగ్రహం



భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

పెదపాడు : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలిచ్చారు. కార్మికులు సహజ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. అదనంగా మట్టి ఖర్చులు మరో రూ.30వేలు, ఇవికాక మహిళా కార్మికుల తొలి కాన్పునకు రూ.30 వేలు, రెండో కాన్పునకు రూ.30వేలు చెల్లిస్తామన్నారు. ప్రమాద వశాత్తు అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షలు అందిస్తామన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. మాయ మాటలతో అమలు సాధ్యంకాని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ చంద్రబాబు విస్మరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. ఫలితంగా దెందులూరు నియోజకవర్గంలోని భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు అలముకున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరతకు తోడు నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో ఆ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఫలితంగా పనులు దొరక్క కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోక వేలాది మంది కష్టజీవులు రోడ్డున పడ్డారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంతవరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతుందనుకుంటే భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారు. నిర్మాణాలు జోరందుకుంటాయి. నిర్మాణ రంగ పనివారికి పనులు దొరుకుతాయి. ఆ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. గతంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఎత్తేసారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు బోర్డు పునరుద్ధరిస్తామని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తక్షణమే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలి. గతంలో కార్మికులకు ఉన్న సంక్షేమం అమలు చేయాలి.

– నారపల్లి రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రమాదం జరిగితే జీవనం దుర్భరం

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్టరు, భవన యజమాని ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎవరూ కల్పించడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా మానసికంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పాలైనా, మంచానికే పరిమితమైనా అప్పులు పాలైనా మళ్లీ వారు తెరుచుకోలేకపోతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కులా ఉండే కార్మికుడు మంచాన పడితే వారి బతుకు బండి ముందుకు సాగడం లేదు.

సంక్షేమ బోర్డుతోనే భరోసా

గతంలో మాదిరిగా భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికుల సాయమందేదనే అభిప్రాయం యూనియన్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడినా, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనా సంక్షేమ బోర్డు ద్వారా ఎంతో కొంత ఆర్థికంగా సాయమందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది తప్ప ఆ దిశగా నేటికీ ఒక్క అడుగూ ముందుకు వేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కావస్తున్నా ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఊసే లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు పదివేల మందికి పైగా కార్మికులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి

దెందులూరు: తమిళనాడులో శివగంగ జిల్లాలో దళిత విద్యార్థి అయ్యప్ప స్వామి బైక్ నడిపినందుకు అగ్రవర్ణ వ్యక్తులు అతని చేతులు నరికి వేయడం అనాగరికమని బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాగిత అచ్యుత్ గౌడ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు తనగల శేఖర్, బయ్యారపు రాజేశ్వరరావు, మద్దాల తిరుపతిరావు డిమాండ్ చేశారు. అత్యంత దుర్మార్గమైన, దారుణమైన ఈ ఘటనపై సుప్రీంకోర్టు మానవతా దృక్పథంతో సుమోటోగా స్పందించి నిందితులపై చర్యలు తీసుకోకపోతే అన్ని ప్రాంతాల్లో ఇదే సంస్కృతి కొనసాగుతుందని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు ఘటన వివరాలతోపాటు తమ డిమాండ్‌తో కూడిన లేఖను పంపుతున్నామని తనగల శేఖర్ శుక్రవారం తెలిపారు

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ అత్యంత పేదరికం నుంచి అత్యున్నత స్థితికి చేరిన సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన సంజీవయ్య నీతి, నిజాయతీలతో పరిపాలనలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పారని తెలిపారు. అధ్యాపకులు టి.వెంకట దుర్గాప్రసాద్, ఎస్ పరమేశ, పి.విజయ కుమార్, పీఆర్ కావ్య శ్రీ పాల్గొన్నారు.

వైభవంగా భోగ శ్రీనివాసమూర్తి విగ్రహానికి పూజలు



గుండుగొలనులో ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో భోగ శ్రీనివాసమూర్తి లోహ విగ్రహ సంప్రోక్షణ పూజలు, హోమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దాతలు కోడూరి శివరాం కృష్ణ, నరసింహమూర్తి, వంశీ తదితరుల ఆర్థిక సాయంతో ఆలయంలో భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠిస్తున్న నేపథ్యంలో చేపట్టిన సంప్రోక్షణ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంగిపతి ఆచార్యులు, విజయగోపాల్ ఆధ్వర్యంలో 10 మంది పండితుల బృందం విశేష పూజలు, హోమం నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామయ్య, భక్తులు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, పక్కనే ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.సునీత

భీమడోలు: హెపటైటిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఎస్.సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఏఆర్‌టీ కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా హెపటైటిస్ బీ,సీ పరీక్షలు చేసి, వ్యాక్సిన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ ఎస్.సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ బీ వ్యాధి వైరస్ వల్ల సంక్రమిస్తుందని, ఇది కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వారానికి ఒక రోజు ఆసుపత్రి వద్ద ఉచిత పరీక్షలు, వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైపటైటిస్ బీ, సీ వ్యాధుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నివారణకు ఈ వ్యాక్సిన్ దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ ఏ.హరినాథ్‌కుమార్, హెడ్ నర్స్ ఎస్.శైలజ, కౌన్సలర్ సీహెచ్ సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ పాపారావు, ప్రాజెక్టు మేనేజర్ శిరీషా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన కల్పించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ బీమా సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహన బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం బీమా కంపెనీల ప్రతినిధులకు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏలూరులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మోటారు వాహనాల బీమా కంపెనీల ఉద్యోగులు, సర్వేయర్లతో ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా మోటారు వాహనాల బీమా ప్రయోజనాలు అందించాలని కోరారు. వివిధ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధుల సందేహాలను కరీం నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లాలోని ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులు, సర్వేయర్లు, ఆర్టీఓ కృష్ణారావు, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు బి.భీమారావు, బి.శేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలు



అంగన్‌వాడీలకు ఆట పాటలతో కూడిన విద్యాబోధనపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నూర్జహాన్

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలని పూళ్ల క్లస్టర్ సూపర్‌వైజర్ నూర్జహాన్ అన్నారు. భీమడోలు, గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ, పఢై బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో రోజైన శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూలు చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, కిషోర్ బాలికల ఆరోగ్యం, చిరుధాన్యాల వినియోగం తదితర అంశాలపై నూర్జహాన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార లోపం వల్ల చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. సేంద్రియ పద్ధతులతో పోషణ వాటికలో ఆకుకూరలు, కూరగాయలను పండించి వాటినే వారికి ఆహారంగా అందజేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. వయస్సు తగ్గ బరువు, ఎత్తు తగ్గ బరువు లేని చిన్నారులకు అధికంగా పోషకాహారాన్ని అందించాలన్నారు. తొలుత చిన్నారులు అంశాలపై తయారు చేసిన చార్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

దెందులూరు: అంగన్‌వాడీల్లోని చిన్నారులకు పోషకాహారం, ఆటపాటలతో కూడిన విద్య అందించాలని ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు ఆఫీసర్ కె విజయలక్ష్మి, అడిషనల్ సీడీపీఓ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం దెందులూరు ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు దెందులూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో పోషణ్ బీ, పఢై బీ పథకంపై అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు. నవజాత శిశువు స్థాయి నుంచి వారి ఆరోగ్య అభివృద్ధి బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.కొవ్వలి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ పెదపాడు అడిషనల్ సీడీపీఓ రాజశేఖర్ అంగన్‌వాడీ కార్యకర్తలకు, పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణ సమావేశం నిర్వహించారు.



కొవ్వలి ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ పెదపాడు అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజశేఖర్

భార్యపై కర్రతో దాడి

భీమడోలు: భార్యపై కర్రతో దాడి చేసిన భర్తపై భీమడోలు పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసారు. ఈ దాడిలో గాయపడిన తుమ్మల జోష్న ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే... భీమడోలు పంచాయతీ పరిధిలోని లింగంపాడుకు చెందిన తుమ్మల శ్రీను, అదే గ్రామానికి చెందిన తుమ్మల జోష్నకు 10 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో గొడవలు పడుతున్నారు. తుమ్మల జోష్న హైదరాబాద్‌లెని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చి తన స్వగ్రామానికి వెళ్లేందుకు భీమడోలు రైల్వేగేటు వద్ద దిగింది. లింగంపాడులోని ఇంటికి తీసుకువెళ్లేందుకు తన తండ్రిని రమ్మని గేటు వద్ద నిలబడింది. అక్కడికి వచ్చిన భర్త తుమ్మల శ్రీను భార్య తలపై కర్రతో తీవ్రంగా కొట్టి గాయపర్చాడు. తీవ్ర గాయాలైన జోష్నను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు




భీమడోలులో డీపీవో, సర్పంచ్, అధికారులు, దాతలను సత్కరించిన జాతర కమిటీ సభ్యులు

భీమడోలు: భీమడోలులో గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు వార్లను శుక్రవారం ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనూరాధ, మండల అధికారుల బృందం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. డీపీవో కె.అనూరాధ, సర్పంచ్ పాము సునీతమాన్‌సింగ్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోఆర్‌డీ కె.సుందరి, గ్రామ కార్యదర్శి కేపీఎల్ తనూజతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం డీపీవో కె.అనూరాధ మాట్లాడుతూ 12ఏళ్లకొకసారి నిర్వహించే ఈ జాతర మహోత్సవాన్ని ఐక్యతతో జరుపుకోవడం చాలా ఆనందాన్ని నిస్తుందన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ జాతరను ప్రజలంతా ఐక్యతతో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, అమ్మవార్ల ఆశీస్సులు గ్రామస్తులకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలోని పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర వసతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. అనంతరం డీపీవోతో పాటు అధికారుల బృందాన్ని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మెమెంటోలను అందించారు. కమిటీ పెద్దలు కరణం పెద్దిరాజు, భారీగా భక్తులు హాజరయ్యారు.

బర్డ్‌ఫ్లూ కలకలం.. చికెన్ దుకాణాలు వెలవెల

- కొనేవారు లేక వ్యాపారులకు నష్టాలు
- కొన్ని రోజులు దుకాణాలు మూసివేస్తామంటున్న వ్యాపారులు



భీమడోలు జంక్షన్‌లో వెలవెలబోతున్న కోడిమాంసం దుకాణం

భీమడోలు: బర్డ్‌ఫ్లూ కలకలంతో మాంసప్రియులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా కోడి మాంసం కొనేందుకు ఆసక్తిని కనబర్చడం లేదు. దీనితో మండల వ్యాప్తంగా మాంసపు దుకాణాల వద్ద జనం లేక వెలవెలబోతున్నాయి. కిటకిటలాడే మాంసం దుకాణాలు సైతం వ్యాపారాలు లేక దిగులు చెందాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓ పక్క పశుసంవర్ధక శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు భీమడోలు మండలంలో కోడిమాంసం తినవచ్చునని, ఎటువంటి ఆంక్షలు లేవని చెబుతున్నా... వారి మాటలు జనంలోని భయం పోగొట్టడం లేదనే చెప్పాలి. ఉంగుటూరు మండలంలోని బాదంపూడిలోని ఓ పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ వైరస్ వల్ల కోళ్లు మృత్యువాత పడుతుండడంతో కోడి మాంసపు ప్రియులు అప్రమత్తమయ్యారు. బాదంపూడి గ్రామం భీమడోలు మండలానికి సమీపంగా ఉండడంతో పాటు ఆ ప్రాంతాల నుంచి వచ్చే కోళ్లను తింటే వైరస్ సోకే అవకాశాలుంటాయని పుకార్లు వస్తుండడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. కొద్దిరోజులపాటు కోడి మాంసానికి విరామం పలుకుదామని ప్రజలు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో కొన్ని రోజుల పాటు దుకాణాలను మూసి వేయాలని వ్యాపారులు నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

వెలవెలబోతున్న దుకాణాలు

భీమడోలు, గుండుగొలను, పూళ్లతో పాటు కొల్లేరు గ్రామాల్లో కోడి మాంసం దుకాణాలు 120 వరకు ఉంటాయి. మేజర్ పంచాయతీలైన భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో దుకాణాల్లో ఆదివారంతో పాటు వారపు సంత రోజుల్లో కోడి మాంసం విక్రయం మరింత ఎక్కువగా ఉంటుంది. సెలవులు, వారపు సంతల్లో ప్రతి దుకాణం వద్ద 500 కేజీల నుంచి 800 కేజీల వరకు కోడి మాంసాన్ని విక్రయిస్తుంటారు. వీటితో పాటు ఫంక్షన్లు రోజుల్లో వాటి వినియోగం రెట్టింపు ఉంటుంది. మిగిలిన రోజుల్లో 150 నుంచి 300 కేజీల వరకు మాంసం విక్రయిస్తారు. సమీపంలోనే బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడంతో కోడి మాంసపు ప్రియులు షాక్‌కు గురయ్యారు. దీనితో ముక్క లేకుండా ముద్ద దిగని మాంసపు ప్రియులు సైతం వాటికి దూరంగా ఉంటున్నారు. దీనితో వాటి ప్రభావం కొనుగోళ్లపై పడింది. దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. రోజంతా అమ్మినా ఖర్చులకు రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. మాంసపు ప్రియులు సైతం సాధారణ స్థాయికి చేరుకున్న తర్వాత కోడి మాంసం తిందామని నిర్ణయించుకోవడంతో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. భీమడోలు పశుసంవర్ధక శాఖ ఏడీ ఇక్కుర్తి సాయిరమేష్‌ను వివరణ కోరగా భీమడోలు మండలంలో కోడి మాంసం, కోడి గుడ్డు తినేందుకు ఎటువంటి ఆంక్షలు లేవు. కోడి మాంసం, కోడిగుడ్డును ఎక్కువగా ఉడకబెట్టి తింటే సరిపోతుంది. ఎటువంటి దుష్ప్రచారాలను నమ్మవద్దు. బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదు.

కోళ్లఫారాల పరిశీలన

గణపవరం: గణపవరం మండల పరిధిలోని గ్రామాల్లో కోళ్ల ఫారాలను గణపవరం వెటర్నరీ ఏడి నాయక్ ఆధ్వర్యంలో పశువైద్యశాఖ సిబ్బంది తనిఖీ చేశారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలున్నాయా అన్నది పరిశీలించారు. కేశవరం, కోమట్రు, అప్పనపేట తదితర గ్రామాల్లోని పౌల్ట్రీ ఫారాలను వారు తనిఖీ చేశారు. మండలంలో ఇప్పటివరకూ బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన దాఖలాలు లేవన్నారు. చికెన్, కోడి గుడ్లను ఎక్కువ సమయం ఉడికించి తినడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మండలంలో చికెన్ విక్రయాలు బాగా తక్కువగా జరుగుతున్నాయన్నారు. తెలంగాణ తదితర ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కోళ్ల వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు.

ఘనంగా రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పూజలు, నిత్య కల్యాణం నిర్వహించారు. యజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.